# ఖాండవ దహనం



కరుణాకర్ గిరక్కున తిరిగి ఆ ఏడంస్థుల మేడను కిందికీ పైకీ ఒక్కసారి చూశాడు!

కనుబొమ ముడిపడింది!

ఆ తర్వాత చేతిలో సర్టిఫికెట్లను రెప్పార్చకుండాచూశాడు. కండ్లల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి!

“ఛీఛీ! ఏం మనుషులో?... సంస్కారం లేని మనుషులు. కోట్లు బూట్లు తొడుక్కొని టైలు కట్టుకొని కుర్చీల నిండుకు కూర్చుంటే సరిపోతుందా? ఎదుటిమనిషిని ఇంటి పనిమనిషి కంటే హీనంగా చూసే రోగి మనస్తత్వాలకు నకళ్ళు వాళ్ళు!...

ఒక అభ్యర్థిని ఇంటర్వ్యూ చెయ్యడానికి కూర్చున్న అభ్యర్థులా వాళ్ళు? మనది సెక్యులర్ స్టేట్ కదా? మరి మనముఖ్యమంత్రి కాషాయవస్త్రాలెందుకు ధరిస్తున్నాడు? మన దేశాధ్యక్షుడికి గడ్డమెందుకుంది? అశ్వమేధయాగం ప్రపంచ శాంతికి ఎంతవరకు దోహదంచేసింది? మొన్న మొన్ననే వరుణ జపం చేశారు కదా? వర్షమెందుకు రాలేదు?

ఇవేనా వాళ్ళడిగే ప్రశ్నలు! "పోనీ! ఉద్యోగం ఇచ్చేది వాళ్ళు కాబట్టి వాళ్ళ కిష్టమైనట్లు అడుగుతారు!" అనుకొంటే 'ఈరోజుల్లో డూప్లికేటింగ్ మహాజోరుగా జరిగిపోతూ ఉంది. కొంపదీసి ఇవన్నీ!'.... అన్న సందేహాన్ని వ్యక్తం చేస్తూ నా సర్టిఫికెట్లను చూస్తూ ఆ ముగ్గురు మూర్ఖులు ఒకరి మొగం ఒకరు చూసుకొంటూ బానకడుపులు బద్దలయ్యేటట్లు నవ్వుతారా?'

అర్థగంటకు ముందు ఆ ఏర్‌కండీషన్డ్ గదిలో బాన కడుపుల్ని మోస్తున్న కుర్చీలు అదిరి పడేటట్లు నవ్విన నవ్వులు చెవుల్ని తొలుస్తున్నాయి!

"నావి డూప్లికేట్ సర్టిఫికెట్లా? రాత్రింబవళ్ళు కంటికి వత్తేసుకొని కష్టపడి చదివి సంపాదించిన సర్టిఫికెట్లు డూప్లికేట్లా? వాళ్ళ తెలివి మండా? వాళ్ళకు నోరెట్లా ఆడిందో? పేదవాడి శ్రమకు విలువ లేదు. పేదవాడి మాటకు నీతి నిజాయితీలకు విలువలేదు. పేదవాడి సర్టిఫికెట్లకూ విలువలేదు. ఉంటే నాకెందుకు ఉద్యోగం రాదు? రాలేదంటే ఇవన్నీ డూప్లికేట్లే!"

కరుణాగర్ మనస్సులో తిరుగుతున్న ఆలోచనలు అది ఒక ప్లాట్‌ఫారం అనీ, తానొక 'చదువుకొన్నయువకుడు' అన్న తలంపుకే దూరంచేశాయి.

"ఇవన్నీ డూప్లికేట్ సర్టిఫికెట్లు!... అసలు నేనే ఒక డూప్లికేట్‌ని!" అని కరుణాకర్ తనలో తాను గొణుక్కొన్నట్లున్నా మాటలు మాత్రం పదిమంది చెవుల్లో పడ్తున్నాయి.

ఆ ప్లాట్‌ఫారంమీద అటుయిటు నడుస్తున్నజనం 'అయ్యోపాపం! పిచ్చి పట్టినట్లుందే?' అని సానుభూతిగా చూస్తున్నారు. బాధకు అర్థం తెలియనివాళ్ళు మాత్రం ఒకరకంగా చూస్తూ ఇంకొకరకంగా నవ్వుకొంటున్నారు.

ఆ చూపుల్ని భరించలేక పోతున్నాడు కరుణాకర్. బానకడుపుల నవ్వులు చెవుల్లో జోరీగలయ్యాయి. పెద్దపెద్ద గుండుచెంబు తలకాయల్లో ఊపందుకొన్న మాటలకుమ్మరపురుగులు బొడ్డును తొలుస్తున్నాయి.

మంచి గొడ్డుకు ఒక్క దెబ్బ!

మంచి మనిషికి ఒక్క మాట!!

కరుణాకర్ అరికాలిమంట ఉచ్చికెక్కింది.

"ఇవన్నీ డూప్లికేట్లే!" అని అరుస్తూ చేతిలోని సర్టిఫికెట్లను ఫర్ ఫర్ మని చింపాడు. ఇరవైయేండ్ల కృషిఫలితం ముక్కలై ఈ చేతిలో పిడికెడు... ఆచేతిలో పిడికెడుగా మిగిలింది. ఆ రెండుపిడికెళ్ళను పైకెత్తిపట్టి చూస్తూ పిచ్చిగా నవ్వుతున్నాడు కరుణాకర్! అతడు నవ్వుతున్నా- గుండెల్లో బాధ కండ్లల్లో చేరి ముత్యాలుగా మారి తన కృషి ఫలితాన్ని అభిషేకం చేయలేక నేలపాలవుతున్నాయ్!

నవ్వుతూ ఏడుస్తూ.... ఏడవలేక నవ్వుతూ.... అప్పటికీ ప్రతీకార వాంఛ తీరనట్లుగా చేతిలోని కాగితం ముక్కల్ని పిచ్చిగా చూస్తూ గాలిలోకి విసిరికొట్టాడు.

ఆ ముక్కలు గాలివాటంగా పరుగిడుతున్నాయి- బడి విడిచిన పిల్లల్లాగా! వాటి వెంట పరుగిడుతున్నాడొక కుర్రవాడు బడిపిల్లల వెంటపడిన పిచ్చోడిలాగా!

కరుణాకర్ చూపు ఆ కుర్రవాడి మీద పడింది.

పొట్టి నిక్కరు... సగం వొంటికి కూడా చాలీచాలని చొక్కా.. నల్లని కాగితాల్ని ముక్కలు ముక్కలుగా చింపి నెత్తికతికించినట్లు గూడుకట్టుకున్న తల... ఆ బాట మీద లేస్తున్న మురికంతా వాడి వొంటిమీదనే కాపురం పెట్టినట్లుంది. వాడు గాలివాటంగా కాలికొద్దీ పరుగెత్తుతున్నాడు. ఒక కాలికిందొక కాగితాన్ని ఇంకొక కాలికిందొక కాగితాన్ని తొక్కి పట్టుకొంటున్నాడు. అలానే వొంగి చేత్తో ఇంకొక కాగితాన్ని జవురు కొంటున్నాడు. ఆ తరువాత నింపాదిగా నిలబడి కాళ్ళకింది కాగితాల్ని చేతికందుకొంటున్నాడు. వీపుమీద గోనెసంచిని కిందికి దించి ఈ కాగితం ముక్కల్ని అందులో వేసుకొంటున్నాడు. మళ్ళీ పరుగెత్తుతున్నాడు.

నాలుగు కాగితాలు చేతికి దొరికి ఆ కాగితాల్ని వాడు సంచిలో వేసుకొంటున్నపుడు చూడాలి వాడి మొగంలో తృప్తి!- అది సటపటమైన తృప్తి కాదు. దొంగల్ని తరిమి తరిమి పట్టుకొన్న పోలీసు మొగంలో వెల్లివిరిసే తృప్తి!

చిత్తు కాగితాల్ని ఏరుకొంటున్న ఆ కుర్రవాడి తృప్తిని చూస్తుంటే- కరుణాకర్‌కి విచిత్రంగా ఉంది. రెప్పార్పకుండా ఆ కుర్రవాడిని చూస్తూనే ఉన్నాడు. కానీ ఆ కుర్రవాడు మాత్రం ఎవరినీ చూడటం లేదు. వాడి పని వాడిది.

"ఈ ప్రపంచంలో ఇంతమంది ఇన్నివిధాల బతుకుతూ ఉంటే నేనిన్నాళ్ళూ ఈ కాగితాల్నే చేతపట్టుకొని 'ఉద్యోగం! ఉద్యోగం!' అంటూ కాళ్ళరిగేట్లు తిరిగానే!"

కరుణాకర్‌కి ఏదో జ్ఞానోదయం కలిగినట్లయింది.

ఇరవై ఏండ్లు పాటుపడి సంపాదించిన యోగ్యతా పత్రాలు తనకు పనికి రాకపోయినా ఆ కుర్రవాడి కిచ్చిన తృప్తిని తలుచుకొంటే ఎంతో ఆనందంగా ఉంది.

అతడు నడుస్తున్నాడు!- తృప్తిగా నడుస్తున్నాడు!!

భవితవ్యంలో వెలుగు రేఖామాత్రంగా గోచరిస్తుంటే- అందుకోవడానికి కన్నట్లుగా ఆనందంగా నడుస్తున్నాడు!...

ఆ మహాపట్నం శివార్లలో శ్రీవేంకటేశ్వరా కాటన్ మిల్లు గిడ్డంగులు. ఆ గిడ్డంగుల పక్కన్నే గాదెపక్కకొదిగిన కోడిపెట్టల్లా పూరిగుడిసెలు. ఆ గుడిసెల్లో ఒకానొక గుడిసెలో ఒక ముసలి ప్రాణి. ఉండూర్లోనే ఏదో ఉద్యోగం వస్తుందని వెళ్ళిన కొడుకు ఎప్పుడొస్తాడో? వస్తావస్తా ఏం కబురు తెస్తాడో? అని ఎదురుచూస్తూ ఉంది.

నడక పరుగ్గా వచ్చిన కరుణాకర్ గడపలో అడుగుపెట్టాడు. తల్లి కంట పడింది. ఆమెను చూస్తూనే- "అమ్మా? నాకు ఉద్యోగం వచ్చిందమ్మా!" అంటూ అరిచాడు. గుడిసింటి పైకప్పు పైకెగిరి పోయేటట్లు అరిచాడు.

ఆమాట చెవిని పడేసరికి ఆపూట ఉదయంపడిన కష్టమంతా ఎలా పొయ్యిందో? ఏమో? - ఆ ముసలి ప్రాణికి వెయ్యేనుగుల బలం వచ్చినట్లయింది. "అవునా! నాయనా!" అంటూ అమాంతంగా కరుణాకర్‌ని గుండెల కదుముకొనింది. "ఇన్ని సదువులు సదివిన నా బిడ్డకే రాకపోతే ఇంకెవురికొస్తుంది ఉద్యోగం! దేముడు నా మొరాలకించినాడు." అంటూ ఆతల్లి ఆనందంతో పరవశించి పోతుంటే కరుణాకర్ గుండెలు వెళ్ళగక్కలేని బాధతో విలవిల లాడుతున్నాయి. ఉద్యోగం రాలేదని చెప్పలేదు. వచ్చిన 'ఉద్యోగం ఫలానా' అని చెప్పలేదు. ఆ నిస్సహాయతతో నలుగుతున్న గుండెలు కరిగి నీరవుతున్నాయి. కన్నుల నుండి పైకుబుకుతున్నాయి.

లేగదూడకు పాలిస్తూ ఆప్యాయంగా దాని ఒళ్ళు నాకుతున్న ఆవులా- కరుణాకర్‌ని గుండెల్లో పొదివికొని తల నిమురుతున్న తల్లి ఉన్నట్లుండి ఉలిక్కిపడింది- చల్లని గుండెలమీద వెచ్చని తడి తగిలేసరికి!

అంతే! రెండు చేతుల్తో తలను పొదివి పట్టుకొని పైకెత్తింది.

కండ్లల్లో ఏకధారగా కన్నీళ్ళు!

"యాడస్తా ఉండావా? ఎందుకు నాయనా? మనకష్టాలు తీరిపోతే కండ్లల్లో నీళ్ళా? ఎందుకయ్యా? ఏం జరిగిందో చెప్పయ్యా!"

ఆ తల్లి మాటల్లో ఆతురత ఆర్ద్రత పెనవేసుకొన్నాయి.

ఏమని చెబుతాడు? చెప్పి తనమీద తాను చదివిన చదువు మీద కొండంత ఆశలు పెట్టుకొన్న తల్లిగుండెల్లోనే మంట పెడతాడా? అందుకే ఆగుండెల్లోనే తలదాచుకొని బావురుమన్నాడు.

అయోమయ స్థితిలో ఆతల్లిగుండె విలవిల లాడింది.

కరుణాకర్ ఏడుపు ఎక్కిళ్ళుగామారి ఆ ఎదమీద ఎగిరెగిరి పడ్తూ ఉంది.

ఎలా సహించగలుగుతుందా తల్లి?- అందుకే బిడ్డ తలను రెండు చేతులతో పట్టుకొని మొగాన్ని పైకిలేపింది. ఏకధారగా కారుతున్న కన్నీళ్ళను చూసేసరికి గుండె చెరువయింది. కండ్లు నిండుకొన్నాయి. ఒక చేత్తో బిడ్డ కారుస్తున్న కన్నీళ్ళను తుడుస్తూ 'చెప్పు నాయనా! చెప్పు. ఎందుకీ కన్నీళ్ళో చెప్పరా!' అని అడుగుతూ తాను కన్నీళ్ళు కారుస్తున్న సంగతి మరిచిపోయింది.

కన్నపేగు కారుస్తున్న కన్నీళ్ళు కరుణాకర్ కంట పడింది.

తల్లి కంటతడిని సహించలేక తన్నుతాను సమాధాన పరుచుకొన్నాడు.

"అమ్మా నేనేడవడం లేదమ్మా!... నిజంవమ్మా! నేనెందుకు కేడుస్తాను? ఇవి కన్నీళ్ళు కాదమ్మా!... ఆనందబాష్పాలు!...ఉద్యోగం వచ్చిందన్న ఆనందంలో ఆనందబాష్పాలమ్మా!"

ఆ మాటల్ని నమ్మాలో లేదో తెలియకుండా ఆ పిచ్చితల్లి కొడుకును వెర్రిగా చూస్తూ ఉంది.

"ఏంవమ్మా? ఎందుకలా చూస్తున్నావ్? నా మాట మీద నమ్మకం లేదా?"

"ఎంతమాటెంతమాటరా తండ్రీ! గొంతు నిలవనా కోసినా తప్పు పలకని నా బిడ్డ మాటే నేను నమ్మకపోవడంవా?"

ఈ మాట సమ్మెట దెబ్బలా సూటిగా కరుణాకర్ గుండెలకే తగిలింది. అయినా తానేమీ తప్పుచెప్పడం లేదుకదా? అని నిబ్బరించుకొన్నాడు.

"అమ్మా! నువ్వే చూస్తావుగా! ఈ వేళ సాయంకాలమే డ్యూటీలో చేర్తానమ్మా!" అంటూ తల్లిచేతుల్ని మెల్లగా విడిపించుకొన్నాడు. లేనినవ్వు మొగాన పులుముకొని హుషారుగా ముందుకు నడిచాడు. ఆ గుడిసెలో నులక మంచం కింద చెక్కపెట్టె. ఆ పెట్టెను తెరిచి రెండు పాత ప్యాంట్లను తీసుకొన్నాడు. ఒక పాతకాగితంలో చుట్టుకొన్నాడు. ఒక్కసారి మళ్ళీ తల్లిని చూశాడు.

ఆమె కన్నార్పకుండా తన వైపు చూస్తూనే ఉంది.

"ఏంవమ్మా? ఎందుకలా చూస్తున్నావే? నేను చెప్పేది అబద్ధమనుకొన్నావా? లేదమ్మా! లేదు. నువ్వేమీ ఇక దిగులు పడద్దమ్మా! ఇకమీదట నిన్ను పువ్వుల్లో పెట్టి పూజిస్తానమ్మా!" అంటూనే గబగబ బయటికి నడిచాడు.

'ఆయనే బతికుంటే నా బిడ్డ కిన్ని తిప్పలా? అదేదో ఆయనే పడేవోడు. ఇప్పుడట్లా కాకపాయ. అయినదానికి కానిదానికి అన్నిటికి నా బిడ్డ పడరానిపాట్లు పడ్తా ఉంటే– కడుపు తరక్కపోతా ఉండాది. అయినా నేనేం చెయ్యగల్ను? ఊరికి ఉత్తరం దక్షిణం రొండూ తెలవని ముదనష్టపుదాన్ని. అన్నిటికి ఆ బగమంతుడే ఉండాడు!" అని ఆతల్లి కొడుకువెళ్ళిన వైపే చూస్తూ ఆలోచిస్తూంటే చెవులు చిల్లులు పడేటట్లు మిల్లులో సైరన్ కూసింది!

"అయ్యో! అప్పుడే గెంట పన్నెండైపొయ్యిందే! ఇయ్యాలవదాకా పొయ్యి అట్లా రాజెయ్యలేదే? పొద్దుతో పోటీపడ్తా లేసి పొయ్యిన బిడ్డగదా? ఏం తిన్నాడో? ఏవో పాపం! వాడొచ్చేకుందికంత ఉడకబెట్టెయ్యకపోతే ఎట్లా?" అనుకొంటూ లేచి ఆమె వంటప్రయత్నంలో పడింది.

పొద్దు తిరుగుతున్న వేళలో పొట్లం ఒకటి చేతపట్టుకొని కరుణాకర్ ఆడుతూ పాడుతూ ఆనందంగా వచ్చాడు. ఆ పొట్లాన్ని చెక్కపెట్టెలో పెట్టి వచ్చి కూర్చున్నాడు.

తల్లి ఎదురుగా బిడ్డ. బిడ్డ ఎదురుగా తల్లి. ఒకరి ఎదురుగా ఒకరు కూర్చొని తృప్తిగా తిన్నారు.

సెకండ్లు నిముషాలై నిముషాలు గంటలై కలబడి ఆడే ఆటగాళ్ళులా సూర్యుణ్ణి బంతిని తన్నినట్లు తన్నుతూంటే గోల్ వైపు పరుగెడుతున్న బంతిలా సూర్యుడు పడమట దిశకు జారుకొంటున్నాడు.

పొద్దు గూట్లో పడింది.

గుడిసింట నట్టింట గూట్లో దీపం వెలిగింది.

కరుణాకర్ కాళ్ళు చేతులు కడుక్కొన్నాడు. మంచం కింద చెక్క పెట్టెను తెరిచి పొట్లాన్ని చేతికెత్తు కొని విప్పాడు.

అందులో రెండు నిక్కర్లు!

తాను తొడుక్కొంటున్న రెండు పాత ప్యాంట్లను కత్తిరించి కుట్టించుకొన్న నిక్కర్లు. ఒక నిక్కరు చేతికందుకొన్నాడు. అలాగే కాసేపు పరీక్షగా దాన్ని చూస్తుంటే మనస్సు ఒక్కసారిగా వెనక్కు వెళ్ళింది!....

ఆరోజు! నిక్కర్లను వదిలేసిన రోజు! ప్యాంటు తొడుక్కొని కాలేజీకి వెళ్ళుతున్నామని సంబరపడిన రోజు!

ఈ రోజు! వదిలేసిన నిక్కర్లని మళ్ళీ తొడుక్కొంటున్న రోజు!

అంటే?– నిజమైన బతుకు మళ్ళీ ఆరోజు నుండే ప్రారంభమవుతూ ఉందన్న మాట! ఈ మధ్యకాలంలో చదివిన చదువులు... గడిచిన జీవితం... అంతా వృథా అయిపోయిందన్న మాట! ఈపని ఆరోజే చేసిఉంటే!–

గుండెల్లో వ్యధ!– పెదాలపై చిరునవ్వు!!

అయినా ఏదోబంగారు భవిష్యత్తు ఆహ్వానం పలుకుతున్నట్లు తెంపు.

కరుణాకర్ గబగబ ఆ నిక్కర్ని తొడుక్కొన్నాడు. ఒకసారి తనకు తానే కిందికి పైకి మార్చి మార్చి చూసుకొని తృప్తిగా నవ్వుకొన్నాడు. ఆ తరువాత తానెంతో అపురూపంగా చూసుకొంటున్న ఒక పుస్తకాన్ని చేతికందుకొన్నాడు. అయిదారు పేజీల్ని కసిదీరా విడివిడిగా చింపాడు. 'అమ్మా! ఈ కాగితాల్ని చేత పట్టుకో! అమ్మా!" అంటూ తల్లి చేతికిచ్చాడు.

ఆ తల్లికి అంతా అయోమయంగా ఉంది. కాగితాల్ని చేతపట్టుకొని కన్నార్పకుండా కొడుకు వైపు చూస్తూ ఉంది.

కరుణాకర్ ఒక గోనె సంచిని చేతికందుకొన్నాడు. తల్లి దగ్గరికి చేరి 'అమ్మా! ఆ కాగితాల్ని అలా వాకిట్లో పారేయమ్మా!" అన్నాడు.

ఆమె పారేసింది.

ఆ కాగితాలు గుడిసింట ముందర గాలికి పరుగెత్తుతున్నాయి– గద్దను చూసిన కోడి పిల్లల మాదిర.

కరుణాకర్ ఒక్క ఊపులో బయటికి దూకాడు. ఆ కాగితాల వెంటబడి పట్టుకొన్నాడు. గోతంలో వేసుకొన్నాడు. నేరుగా తిరిగివచ్చి వంగి తల్లిపాదాలకు నమస్కరిస్తూ 'నన్ను ఆశీర్వదించమ్మా!" అన్నాడు.

ఆ తల్లి బోరుమని ఏడుస్తూ కుప్పగా కూలిపోయింది!

కరుణకర్ గోనె సంచిని భుజాన వేసుకుని ముందుకు నడుస్తున్నాడు. తిరిగి చూడకుండా ముందుకు నడుస్తున్నాడు.

చుట్టు గుడిసెలో ఆ ముసలిదాని ఏడుపు సుళ్ళు తిరుగుతూ ఉంది.

బయల్దేరడమైతే కరుణాకర్ మహా జోరుమీద బయల్దేరాడు. తనధ్యేయాన్ని సాధించి తన ఈడువాళ్ళకు తానొక ఆదర్శంగా నిలబడాలన్న పట్టుదలతో బయల్దేరాడు. అందుకే పొట్టి నిక్కరుతో మాసిన చొక్కాతో వీపున గోతంతో రాజాలా నడుస్తున్నాడు.

రాజాలా నడుస్తున్న కరుణాకర్ 'ఠకీ!' మని ఆగి పోయాడు. ఎదురుగా రాజబాట!– నల్లని ఆ తారురోడ్డు తనదారికడ్డంగా పడుకొన్న నల్లత్రాచులా కనిపిస్తూ ఉంది.

కాళ్ళు నిలబడినా మనసు నిలకడగా లేదు. దానిదారి దానిది!

"ఈ బాటమీద తెలిసిన మొగా లెదురైతే?... కొంపదీసి స్నేహితులే పలకరిస్తే! ఛాఛా! ఎందుకింత తొందర పడ్డాను. ఇప్పుడు మాత్రం ఏంకొంపలు మునిగిపోతున్నాయ్? తిరిగి వెళ్ళిపోతే?... వెళ్ళి అమ్మకు మొగమెలా చూపించేది?... చూపితేయేం? ఆ తల్లి ఇంకా సంతోషిస్తుంది!– అయినా ఇదేఁవిటి పిరికి తనం? దొంగతనం చేస్తున్నానా? ద్రోహం తలపెడ్తున్నానా? కష్టపడ్తాను. నా కాళ్ళమీద నేను నిలబడ్తాను. మొదట మొదట బెరుకు బెరుగ్గానే ఉంటుంది. అలవాటైతే అంతా సరిపడి పోతుంది." కరుణాకర్ మనస్సు రకరకాలుగా ఆలోచిస్తూ ఉంది.

అంతలోనే నాలుగైదు చిత్తుకాగితాలు... పెద్దపెద్ద కాగితాలు!... ఏ చేతినుండి చేజారిపడ్డాయో? ఏమో? గాలికి కొట్టు కొంటూ పోతున్నాయ్. తనపక్కనే పోతూ కంటపడ్డాయి. అప్రయత్నంగానే వంగి జవురుకొన్నాడు.

ఆలోచనలు పుటుక్కున తెగాయి. తెగినఆలోచనల్ని చేతికందిన చిత్తు కాగితాల్ని కలగలిపి సంచిలో వేసుకొన్నాడు. మనస్సు నిమ్మళించింది.

ఇప్పుడు కరుణాకర్ దర్జాగా నడుస్తున్నాడు!

వీధి దీపాలు వెంటపడి తరుముతూంటే చీకటి ఆ మహాపట్టణంలో సందు గొందుల్లో, శివార్లల్లో చేరి చిక్కపడ్తూ ఉంది. కరుణాకర్ అలాంటి అనువైన స్థలాలను ఎన్నుకొన్నాడు. వంచిన తలెత్తనట్లే నడుస్తూ చుట్టూ గమనిస్తూ ఊరి శివార్లను చేరుకొన్నాడు. అయినా మనసు బిక్కు బిక్కుమంటూనే ఉంది. అక్కడ కూడా తెలిసిన మొగమేదైనా కంట పడుతుందేమో? అని. ఒక కంట గమనిస్తూనే కంటపడిన చిత్తుకాగితాన్ని ఏరుకొంటున్నాడు.

పల్లెకొంపల్లో అయితే చీమచిటుక్కుమంటే ఊరూనాడూ ఒక్కటై పోతుంది. మహాపట్నాల్లో ఏముంది? ఎవరి బతుకు వాళ్ళది. ఎవరి దారి వాళ్ళది.

ఆ పూట కరుణాకర్ దారికి ఎవ్వరూ అడ్డు రాలేదు.

నిండిన గోతాన్ని వీపున మోసుకొని కరుణాకర్ ఇల్లు చేరేసరికి రాత్రి పదకొండు గంటలయింది. గోతాన్ని గుడిసింట గోడకు నిలవేసి లోనికి తొంగి చూశాడు.

నట్టింటగూట్లో దీపం నిశ్చలంగా మండుతూ ఉంది. గోడకు చేరగిలబడిన తల్లి నిరామయంగా శూన్యంలోకి చూస్తూ ఉంది. కారిన కన్నీళ్ళు కర్రకట్టాయి!

కరుణాకర్ గుండెల్లో కెలికి నట్లయింది. అడుగుమీద అడుగ్గా నడిచి అమ్మ ముందు తలవంచుకొని నిలబడ్డాడు. ఆమె పట్టించుకొనే స్థితిలో లేదు. కంటపడ్తే కావిలించుకొనే తల్లి కన్నెత్తి చూడకపోవడం ఆ లేత గుండెల్ని కోత కోసినట్లయింది. తట్టుకోలేక "అమ్మా!" అని పిలిచాడు.

ఆ తల్లి ఉన్నట్లుండి ఒక చూపు చూసింది!

ఎన్ని అర్థాలో ఆ చూపులో?

కరుణాకర్ గిలగిల లాడాడు. అయినా నిబ్బరించుకొని "అమ్మా! అంత అన్నం పెట్టమ్మా!" అన్నాడు ప్రాధేయపూర్వకంగా.

"ఛీ! నేన్నీ కమ్మనుగాదు! నువ్వు నాకు బిడ్డవూకాదు. ఫో దూరంగా!"

"నీ కంటికి దూరంగా పోవాల్సినంత తప్పుపని నేనేం చేసినానమ్మా!"

"నువ్వేం తప్పు చేసినావు తండ్రీ! తప్పంతా నాదే! నిన్ను కడుపున మోసి కనిందొక తప్పు. నా చావు నన్ను చావమని అయనేంవో లచ్చిణంగా ఎలబారిపోతే ఇంటింటా శాకిర్జేసి నిన్ను సదివించిందింకొక తప్పు. నా కంటి కెదురుగా నువ్వు సిత్తు కాగితా లేరుకుండేదానికిపోతే నేనింకా బతికుండానే అది అన్నిటికన్నా మించినతప్పు!"

"అమ్మా!" గుండెలు పగిలేటట్లు అరిచాడు కరుణాకర్. ఆ అరుపులో బాధ. ఆ తల్లి గుండెల్ని తాకితే ఆమె గొంతు మూగపోయింది.

ఆ గుడిసింటలో మళ్ళీ రెండు క్షణాల నిశ్శబ్దం!

ఆ రెండు క్షణాల్లోనే కరుణాకర్ తెపురుకొన్నాడు.

"అమ్మా! నువ్వు నన్ను నీ చెమటతోనే చదివించావు. నేను చదువుకొన్నాను. ఇంత తెలివితో చదివినవాడు ఇంకొకడు లేదన్నట్లుగా చదివాను. ఏం ప్రయోజనం? ఈ కాలంలో ఉద్యోగానికి అర్హతలు తెలివితేటలు మార్కులూ కాదమ్మా!... డబ్బుండాలి. లంచాలు కుమ్మరించాలి. రెకమెండేషన్లయినా ఉండాలి. ఇవేవీ లేకపోతే కులంవయినా ఉండాలి. ఏంవీ లేనప్పుడు నన్నేం చెయ్యమంటావ్? చెప్పమ్మా? ఎన్ని పరీక్షలు?... ఎన్ని ఇంటర్వ్యూలు?... పరీక్షల్లో నెగ్గుతున్నా! ఇంటర్వ్యూల్లో రాలిపోతున్నా! నా మాట నమ్మమ్మా! నేను చదివిన చదువులు నువ్వు నమ్ముకొన్న ఈ చదువులు మనబోటోళ్ళకు కూడు పెట్టవమ్మా!"

"అయితే ఈ చిత్తు కాగితాలు కూడు పెట్తాయా నాయినా!"

"ఇప్పుడు కాకపోయినా ఒకనాటికి పెట్తాయి!"

"అప్పిటికి నేనుండను."

"అమ్మా! అసలే పుండుపడిన గుండెమీద కారం చల్లుతావెందుకమ్మా?"

"అ పన్జేస్తున్నది నువ్వా? నేనా?"

"అమ్మా! నన్నర్థం చేసుకోమ్మా! ఈ వయస్సులో నువ్వు కష్టపడి తెస్తుంటే తినేసి హాయిగా తిరగలేను. పోనీ! ఊరిమీదపడి అడుక్కుతిందాంవంటే– 'నీకేవింరా చేటు! గ్రూటం మాదిరుండావే? ఏదైనా పని చేసుకొని బతకరాదా?' అని దెప్పి దెప్పి పొడస్తారు. చదువుకు తగిన ఉద్యోగమా? రాదు. ఏదో ఒకటి చేద్దాంవంటే ఇచ్చేవాళ్ళు లేరు. కడకు ఏ టీ కొట్టులోనో కిరాణా కొట్టులోనో పని చేద్దామంటే...! 'ఈ చదువు కున్నోళ్ళను నమ్మిన వాళ్ళెవరు? ఎంత డిపాజిట్టు కట్తావు?' అంటారు. ఇంకేం చెయ్యమంటావమ్మా? పెట్టుబడి లేకుండా చెయ్యగలిగిన వ్యాపారం ఇదొక్కటే!– బాగా ఆలోచించే ఈ నిర్ణయానికొచ్చినాను. 'ఈపని కూడ చెయ్యద్దు!' అంటే– ఇంక చెయ్యగలిగిన పని ఒక్కటే!.. అంత విషం తిని చావడం!"

"నాయినా!" అంటూ ఆ తల్లి అమాంతంగా పైకి లేచి బిడ్డను గుండెల కదుముకొనింది.

బిడ్డను చూసి తల్లి. తల్లిని చూసి బిడ్డ. ఒకర్ని చూసి ఒకరు ఏడుస్తున్నారు. ఎంతసేపు ఏడ్చినా ఎవరున్నారు ఓదార్చడానికి?–

కాలం బరువుగా సాగిపోతూ ఉంది.

ఇక తప్పదన్నట్లుగా ఎవరి బాధను వాళ్ళు దిగమింగారు. ఒకబాధ తీర్తే మనిషికి ఇంకొక బాధ. ఆ నడిజాములో అయిష్టంగానే అంత ఎంగిలి పడ్డారు. ఎవరి దారిన వాళ్ళు వెళ్ళి పడుకొన్నారు.

ఆ రాత్రి అలా గడిచి పోయింది.

ఆ తరువాత ప్రతిరాత్రి కరుణాకర్ ఊరి మీద పడుతున్నాడు. దాదాపు అర్థరాత్రి వరకు తిరగని చోటు లేదన్నట్లుగా తిరిగి చిత్తు కాగితాల్ని సేకరిస్తున్నాడు. అలా సేకరిస్తూంటే ఎన్ని అనుభవాలో?–

ఒకరోజు రాత్రి. దాదాపు అర్థరాత్రి కావస్తూ ఉంది. మూట నిండడానికింకా కాసిన్ని కాగితాలు తక్కువగా ఉంటే తిరుగుతున్నాడు. ఒకానొక నాలుగు రోడ్ల కూడలిలో రాజకీయ నాయకుడి పొట్టలా ఉబ్బిన ఒక కుప్ప తొట్టి కంట పడింది. దుర్వాసన ముక్కుపుటాల్నిదర కొడ్తూ ఉంది. అయినా భరించి తొట్టి మీదికి వంగి కాగితాల్ని ఏరుకొంటున్నాడు. అంతలోనే వట్టి కాలిమీద ఒక దెబ్బ 'ఫఠ్'మని పడింది. గబుక్కున వెనక్కు తిరిగి చూస్తే గాడిద! వెనక్కాళ్ళతో ఒక్క తన్నుతన్ని ఓండ్రిస్తూ ఉంది.

"ఒరే చదువు కొన్న గాడిదా! ఇదేం పనిరా? చదివినంత చదువు చదివి కడకు గాడిద కూడు కుడుస్తున్నావు కదరా? ఇదేనా నీ సంస్కారం?" అని అడిగినట్లుందా ఓండ్రింత.

కరుణాకర్ వేదాంతిలా ఒక చిరునవ్వు నవ్వి దానికొక నమస్కారం కూడా పెట్టి ముందుకు కదిలాడు.

ఇంకొకరోజు రాత్రి. గోనె సంచి భుజాన వేసుకొని దర్జాగా నడుస్తున్నాడు. గోడకంటించిన సినిమా వాల్‌పోస్టర్. ఒక పక్క ఊడి గాలికి రెపరెపలాడుతూ ఉంది. అప్పుడే కాకపోయినా

మరి కాసేపటికి అది ఊడి నేల పడడం ఖాయం. అంతలావు సినిమా హీరోని నేల పడనీయడం ఎందుకని కరుణాకర్ ఆ పోస్టర్ని లాగుతున్నాడు. 'ధం' అని వీపున ఒక పిడిగుద్దు పడింది. అదిరిపడి వెనక్కు తిరిగి చూస్తే తన ఈడువాడు.

"ఏరా లోఫర్ నా కొడకా? ఈదేశంలో హీరోలకు అభిమానసంఘాలున్నాయను కొన్నావా? చచ్చినాయనుకొన్నావా?" కోపంతో కొంకర్లు తిరిగి పోతున్నాడా భావిభారతపౌరుడు.

కరుణాకర్ వంచిన తలెత్తలేదు.

"ఏరా? చిత్తు కాగితాల వ్యాపారంవేనా? లేకుంటే వేళకాని వేళ ఈ సాకుతో కత్తిరించే వ్యాపారంవా?" ప్రతిరాత్రి పోలీసు మొగుళ్ళ దెప్పుళ్ళు.

అయినా కరుణాకర్ పట్టు వదలని విక్రమార్కుడే అయ్యాడు!

పదహైదు రోజులకు పది మూటలు సేకరించాడు. అమ్మితే కొంత డబ్బు వచ్చింది. చెక్క పెట్టెలో భద్ర పరిచాడు. ఆ తరువాత పదహైదు రోజుల్లో పదహైదు మూటలు సేకరించాడు. అమ్మాడు. ఈడబ్బు ఆడబ్బుతో కలిపాడు.

నాలుగు డబ్బులు చేతికొస్తే నలభైరకాల ఆలోచనలు మనిషికి!

ఇంటింటికి తిరిగి న్యూస్ పేపర్ ఎందుకు కొనకూడదు? అనుకొన్నాడు. అంతే! ప్యాంటూ షర్టూ తొడిగి బాడుగ సైకిలెక్కాడు. పగటి పూట వీధివీధి తిరిగి న్యూస్ పేపర్ కొనడం. రాత్రిపూట చిత్తు కాగితాలు సేకరించడం!"–

చిత్తుకాగితాల వ్యాపారం కొత్తఊపిరి పోసింది కరుణాకర్‌కి!

ఇప్పుడు కరుణాకర్ ఒక కొత్తసైకిల్ కొన్నాడు. ఒక కుర్రవాడిని పనికి కుదుర్చుకొన్నాడు. ఆ కుర్రవాడు వీధులు తిరిగి న్యూస్ పేపరు కొంటూంటే తాను ప్రింటింగ్ ప్రెస్సులో కటింగ్ జల్లి కొంటున్నాడు.

కరుణాకర్ శ్రమకు పట్టుదల తోడయింది.

ఆరు నెలలు తిరిగేసరికి గుడిసింటి ముందర లారీభర్తీ అవుతూఉంది.

"అయ్యో పాపం!" అన్న వాళ్ళే 'ఆహా! ఓహో!' అంటున్నారు.

'వాడికేదో పిచ్చిపట్టింది.' అన్నవాళ్ళే తెగమెచ్చు కొంటున్నారు.

కరుణాకర్ తల్లికి ఒక పక్క ఆనందంగా ఉన్నా ఇంకొక పక్క "చదువు కున్న బిడ్డ ఉద్యోగం చెయ్యకుండా ఏందో ఈ చిల్లరాట్లు?" అని అసంతృప్తిగానే ఉంది.

అయినా కరుణాకర్ ఇదంతా గమనించే స్థితిలో లేదు. అతనికి ఇప్పుడు క్షణం తీరిక చిక్కడంలేదు. ఒకటి రెండు సార్లు తల్లి దగ్గర కూర్చొని ఆమెను చాకిరీనుండి విముక్తురాల్ని చేయాలని శతపోరాడు. కానీ! కాలూ చెయ్యి ఆడేదాకా ఈ బతుకులో చెయ్యాల్సిందే!' అని ఆమె మొండి పట్టు పట్టడంతో ఆ ప్రయత్నాన్ని విరమించుకొన్నాడు.

వ్యాపారం బాగా పెరిగింది. ఇప్పుడతని దగ్గర అయిదారుమంది కుర్రాళ్ళు పనిచేస్తున్నారు. ఆ కుర్రవాళ్ళు తెచ్చిన పాతన్యూస్‌పేపర్ని, చిత్తుకాగితాల్ని, కటింగ్‌జల్లిని జాగ్రత్తగా తూకాలు వేసుకోవడం... వాళ్ళకు పైసలిచ్చి పంపడం.... మళ్ళీ ఆ చిత్తును బస్తాల్లో భర్తీ చేయించడం... తూకాలు వేయించడం...ఆ తూకాల్నీ ఆయాబస్తాలమీద సిరాతో మార్క్ చేయించడం– ఈ పనులన్నీ చేస్తున్న కూలీలకు కూలీలు బట్వాడా చేయడం– 'కార్యవాదికి ఏమైనా కార్యం మీదనే కన్ను!' అన్నట్లుగా వ్యవహరిస్తున్నాడు.

నాలుగు డబ్బులు చేతికి మిగులుతూంటే కాలం గడిచినట్లే తెలియడం లేదు.

ఒక రోజు మధ్యాహ్నం. కరుణాకర్ కాగితాల్ని తూకం వేయిస్తున్నాడు. అప్పుడతని దృష్టి ఒకకాగితం మీదపడింది. ఆ కాగితంలో ఒక ప్రకటన. ఆ ప్రకటన వైపే చూస్తూ చాలాసేపు ఆలోచించాడు కరుణాకర్. ఒక్కసారిగా నాలుగైదు మెట్లు పై కెక్కడానికి అదే మార్గంగా తోచింది. తలతాకట్టు పెట్టిఅయినా అందులో దిగవలసిందే! అనుకొన్నాడు.

కాటన్ మిల్లులో 'వేస్ట్' తాలూకు బహిరంగ వేలం ప్రకటన అది. ఆ వేలానికి దాదాపు ఇరవై రోజులు వ్యవధి ఉంది. అయితే డిపాజిట్టు మాత్రం రెండు రోజుల్లోపలే చెల్లించాలి.

కరుణాకర్ చేస్తున్న పనిని విడిచి పెట్టి నేరుగా బ్యాంకుకు వెళ్ళాడు. బ్యాంకు మేనేజర్ని కలుసుకొన్నాడు. పరిస్థితిని వివరించి చెప్పాడు. ఒక వేళ పాటదారుడు తానైతే ఆ 'స్టాక్స్' మీద అప్పు మంజూరు చేయమని అభ్యర్థించాడు.

మేనేజర్ ఒక్క క్షణం ఆలోచించాడు.

"చూడు కరుణాకర్! నువ్వు ఈ బ్యాంకులో అక్కౌంట్ ప్రారంభించి నప్పటినుండి నేను నిన్ను గమనిస్తున్నా. ముఖస్తుతి కాదు కానీ చదువుకొన్న ప్రతి విద్యార్థి నిన్ను ఆదర్శంగా తీసుకొంటే– దేశంలో నిరుద్యోగ సమస్య ఏమవుతుంది? తోక ముడుచుకొని పారిపోతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో దేశానికి కావాల్సింది నీలాంటి వాళ్ళే బాబూ!– ప్రొసీడ్!– నా సహాయం ఎప్పుడూ నీకు తప్పకుండా ఉంటుంది" అంటూ మేనేజర్ అభయమిచ్చాడు.

కరుణాకర్ ఆనందానికి అవధులు లేవు.

ఆ బ్యాంకులో అంత వరకు తాను దాచుకొన్న డబ్బును డ్రా చేసుకొన్నాడు. నేరుగా కాటన్ మిల్స్‌కు వెళ్ళాడు. కాటన్ మిల్స్ నిబంధనల మేరకు ధరావత్తు చెల్లించాడు. తృప్తిగా ఇల్లు చేరాడు. అయితే ఆ తరువాత ఒడిలో చేతులు పెట్టుకుని కూర్చోకుండా ఒక్క కిలో వేస్ట్ మార్కెట్ వెల ఎంత? దాన్ని శుభ్ర పరచడానికెంత ఖర్చవుతుంది? అన్న వివరాలు సేకరించాడు. కిలో మీద తనకెంత గిట్టుబాటుండాలో నిర్ణయించుకొన్నాడు. ఆ ప్రకారమైతే తాను వేలం పాట ఎంత వరకు పాడవచ్చో నిర్ణయించు కొన్నాడు. ఆ రోజు కోసం నిరీక్షిస్తున్నాడు.

ఇది రాతియుగం కాదు. రాకెట్ యుగం. ఇరవై రోజులు గడవడం ఎంతసేపు?

ఆ రోజు రానే వచ్చింది.

అనుకోని విధంగా కరుణాకర్ వేలం పాట దారుడు కావడం కూడా జరిగిపోయింది.

కరుణాకర్ అగ్రిమెంటులో సంతకాలు పెట్టాడు. అటునుండి అటే బ్యాంకుకు వెళ్ళి మేనేజర్‌కి విషయాన్ని తెలిపాడు. నెలరోజుల్లో స్టాక్స్ క్లియర్ చేయాల్సిన సంగతి కూడా వివరించాడు. మేనేజర్ నిజంగా సంతోషించాడు. యోగ్యుడు. తెలివిమంతుడైన పేద యువకుడికి సహాయం చేస్తున్నామన్న ఆనందంతో "బాబూ! ఈ రోజే అనుమతి కోసం హెడ్డాఫీసుకు రాస్తున్నా. వారం పది రోజుల లోపుగానే తప్పకుండా అనుమతి వస్తుంది. ఆ మీదట నువ్వు ఎప్పుడైనా వచ్చి డబ్బు తీసుకోవచ్చు బాబూ!" అంటూ అభినందించాడు.

కరుణాకర్ ఆనందలహరిలో తేలిపోతున్నాడు. గాలిలో తేలిపోతున్న కాళ్ళను నిలదొక్కుకుని ఊహల్లో ఉరుకుల పరుగుల మీద ఉన్న మనస్సును స్వాధీనానికి తెచ్చుకొని గాలిలో తేలి వచ్చినట్లుగా ఇల్లు చేరాడు.

ఆరోజు నుండి కరుణాకర్ కూర్చున్నా పడుకొన్నా తల నిండుకు ఆలోచనలే! వేలం పాటలో కొన్న 'వేస్ట్' మీద ఆలోచనలే! ఆలోచనలో ఆనందం. ఇక ఖచ్చితంగా తన బతుకు ఒక మలుపు తిరుగుతుందన్న ఆనందం!

కాలం పరుగిడుతూ ఉంది.

వారం రోజుల తరువాత ఒకరోజు రాత్రి దాదాపు అర్ధరాత్రి కాస్తూ ఉంది. అప్పటికే పనులు తెమిల్తే కరుణాకర్ వెళ్ళి పడుకొన్నాడు. పడుకొన్నా నిద్ర పట్టడం లేదు. గతాన్ని నెమరు వేసుకొంటూ భవిష్యత్తు పై బంగారు కలలు కంటూ మనసు దాని దారిలో అది అడ్డు ఆపూ లేకుండా పోతూ ఉంది. దాన్ని అదుపులోకి తెచ్చుకొందామని సతమతమవుతూంటే ఉన్నట్లుండి హాహాకారాలు చెలరేగాయి. కరుణాకర్ ఎగిరిపడి లేచాడు. ఒక్క లగువులో బయటపడ్డాడు.

కాటన్ మిల్ గోడౌన్ తగలబడిపోతూ ఉంది.

మంటలు ఆకాశాన్నంటుతున్నాయి. పూరిగుడిసెల్లో పేదజీవులు గుండెలు బాదుకొంటూ గుడిసెల్ని రక్షించుకోవాలని హడావిడిగా అటుయిటు పరుగెత్తుతున్నారు.

అంతవరకు అదృష్టం! గాలి మరొక దిశగా వీస్తూ ఉంటే మంటలు గుడిసెల జోలికి రాలేదు.

అయితే కరుణాకర్ వేలం పాటలో కొన్న వేస్ట్... ఆ వేస్ట్‌తో కలిసి లారీ లోడు చిత్తు కాగితాలు– తన ఇంటి వాకిట్లో చోటు లేక గోడౌన్ గోడల కానించి నెట్టు కట్టిన చిత్తుకాగితాల బస్తాలు– కాలి పోతుంటే కరుణాకర్ గుండెలు కాలిపోతున్నాయి. అయినా ఏం చేస్తాడు? నిలువు రాయిలా నిలబడి చూస్తున్నాడు.

అదే సమయంలో ఏర్‌కండిషన్ గదిలో కాటన్ మిల్ యజమాని పరశురామ్... ఎ.హెచ్. బ్యాంకు గోడౌన్స్ సూపర్‌వైజర్ అర్జునరావు... ఇన్స్యూరెన్స్ కంపెనీ మేనేజర్ కృష్ణారావు– సీమసరుకు సిప్ చేస్తూ చిద్విలాసంగా ఉన్నారు.

కాలుతున్న గోడౌన్ మంటలకు తన నవ్వుల్ని కలగలిసినట్లుగా కృష్ణారావు 'అయ్యా! అవధానిగారూ! అనుకొన్న ప్లాన్ ప్రకారం ఖాండవదహనం జరిగిపోయింది. అర్జునరావు తనపాత్ర సమర్థవంతంగా నిర్వహించారు. రికార్డు అద్భుతంగా ఉంది. మీ ఆకలి తప్పకుండా తీరిపోతుంది. ఆపూచీ మాత్రం నాది. మీరేమీ సందేహించవలసిన పనేలేదు. అయితే ఆనాడు ఖాండవదహనంలో కృష్ణుడికి పారితోషికంగా పాంచజన్యం లభించింది. మరి నాకో? కనీసం ఒక మారుతీ కార్!" అంటుంటే "గాండీవమంత అస్త్రాన్ని బహుమతిగా ఇచ్చినా నావిద్యలో నేను నిపుణుడినే కానీ విలువిద్యలో కాదు కాబట్టి నాకొక డాల్ఫిన్ కారు చాలు!' అని అంటున్నాడు అర్జునరావు. ఆకలి తీరిన అగ్నిహోత్రుడు అదే పరశురామ్ ఎ.హెచ్. సహకరించిన ఫైర్ సర్వీసును కూడా సన్మానించాలి కదా?" అని అంటుంటే ఆయన సహృదయతకు అర్జునరావు, కృష్ణారావు చేతులెత్తి నమస్కరిస్తూ నవ్వుతూంటే బానకడుపులు లయబద్ధంగా ఆడుతున్నాయి!

ఇది నిజంగా ఖాండవదహనమే! ఈ దేశంలో ఇలాంటి దహనాలు జరుగుతూనే ఉంటాయి. కరుణాకర్ లాంటి సాధుజంతువులు కాలిబూడిద అవుతూనే ఉంటారు! ●

ఆంధ్రపత్రిక
(8, నవంబర్ 1985)
దీపావళి కథానికలపోటీలో ప్రథమ బహుమతి